

# బిజెపి మతోన్మాద విధానాలను విడనాడాలి



సూళ్లూరుపేటలో గాంధీ విగ్రహం వద్ద నిరసనలు

**ప్రజాశక్తి - సూళ్లూరుపేట:** మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయంపై చేపడుతున్న నిరసన కార్యక్రమాలలో భాగంగా సూళ్లూరుపేట, మహాత్మగాంధీ విగ్రహం వద్ద శనివారం సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. నూతన చట్టం అమలు జీవో ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ నాయకులు మాట్లాడుతూ చట్ట బద్ధ హక్కుగా ఉన్న ఉపాధి హక్కును రద్దు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని, బిజెపి మతోన్మాద విధానాలను విడనాడాలని లేని పక్షంలో తీవ్ర పరిణామాలు చవిచూడవలసి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, ఎస్.అల్లేయ్య, ఎస్.కె.రియాజ్, బి.పద్మనాభయ్య, ఎస్.కె.అక్బర్ బాషా, బి.భాస్కర్, అగ్రికల్చర్ సభ్యులు ఎస్.కె.ఫయాజ్, అమీర్, గౌహర్ బాషా, వి.కృష్ణ, డివైఎఫ్ఐ నాయకులు మహేష్, ఇలియ్, ఆటో కార్మిక సంఘ నాయకులు కరీం, బాలాజీ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

### కూలీల కడుపుకొట్టొద్దు

**ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ:** మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బిజెపి ప్రభుత్వం జీరామ్ జి పేరుతో కొత్త పథకంగా తీసుకొస్తూ వ్యవసాయ కూలీల కడుపు కొట్టుతున్నారని, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నలగురి రమణయ్య విమర్శించారు. పని రోజులు, నిధుల కేటాయింపులో మార్పులతో చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అప్పుల ఊబిలో ఉన్నందున ఈ పథకానికి భారీ స్థాయిలో నిధులు కల్పించలేక ఈ పథకాన్ని ఆటకెక్కించే పరిస్థితి వస్తుందన్నారు. అనంతరం ఉపాధి హామీ చట్టం బిల్లు నకలును దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు చిన్న గురవయ్య, తిరుపాలు, మండల నాయకులు సుబ్బయ్య, జెక రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# 24న శ్రీహరికోట నుండి అమెరికా శాటిలైట్



**ప్రజాశక్తి - సూళ్లూరుపేట :** భారత అంతరిక్ష చరిత్రలో అత్యంత ప్రతిష్టాత్మకమైన శ్రీహరికోట నుంచి అమెరికా భారీ శాటిలైట్ ప్రయోగం డిసెంబర్ 24న బుధవారం ఉదయం 8.54 గంటలకు ప్రయోగం జరగనుంది. దేశ శాస్త్రీయ సామర్థ్యాన్ని ప్రపంచానికి ఘనంగా చాటే ఈ చారిత్రక అంతర్జాతీయ ప్రయోగం జరగనుండగా శ్రీహరికోట సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం మరోసారి ప్రపంచ దృష్టిని ఆకర్షించనుంది. భారత ప్రభుత్వ రంగ సంస్థ న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ బాధ్యతగా నిర్వహిస్తున్న ఈ మిషన్ ద్వారా అమెరికాకు చెందిన భారీ వాణిజ్య శాటిలైట్ బ్లూ బర్డ్ బ్లాక్ 2ను భూమి చుట్టూ నిరంతరం పరిభ్రమించే కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టనున్నారు. భారతదేశంలో అత్యంత శక్తివంతమైన గగన్ యాన్ శ్రేణికి చెందిన ఎల్ బి ఎం 3 రాకెట్ ద్వారా నిర్వహించనున్న ఈ ప్రయోగాన్ని ఎల్విఎం 3 ఎం 6 మిషన్‌గా పిలుస్తున్నారు. రెండో ప్రయోగం వేదిక నుంచి చేపట్టనున్న ఈ మిషన్‌లో ప్రయోగించబడే శాటిలైట్ బరువు సుమారు 6,500 కిలోలు. ప్రపంచ వ్యాప్తంగా సాధారణ స్మార్ట్ ఫోన్‌లకు నేరుగా హై స్పీడ్ సెల్యులార్ బ్రాడ్ బ్యాండ్ సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ శాటిలైట్ ను రూపొందించారు. దాదాపు 2400 చదరపు అడుగుల విస్తీర్ణం గల అత్యాధునిక కమ్యూనికేషన్ అరేలు ఇందులో ఉండటం విశేషం. ఎర్త్ ఆర్బిట్ లో ఇప్పటివరకు ప్రయోగించిన వాణిజ్య శాటిలైట్‌లలో ఇదే అతి పెద్ద ప్రయోగంగా నిలవనుంది. ప్రతి కవరేజ్ ప్రాంతంలో గరిష్టంగా 120 వేగం అందించే సామర్థ్యం ఈ శాటిలైట్‌కు ఉంది. ఒకప్పుడు ఇతర దేశాల సహకారంపై ఆధారపడిన భారత అంతరిక్ష కార్యక్రమం నేడు అమెరికా వంటి అగ్రశ్రేణి దేశాల శాటిలైట్లను స్వదేశీ రాకెట్ ద్వారా ప్రయోగించే స్థాయికి ఎదగడం దేశ శాస్త్రీయ శక్తికి స్పష్టమైన నిదర్శనంగా నిలుస్తోంది. ఈ మిషన్ ద్వారా అంతర్జాతీయ వాణిజ్య అంతరిక్ష రంగంలో భారత్ విశ్వసనీయత మరింత పెరిగి ప్రపంచంలో భారత స్థానం మరింత బలపడనుంది.

# పిపిపిపై జగన్‌కు అవగాహన లేదు : శాప్ చైర్మన్




**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులకు సాధారణంగా వచ్చే మెడికల్ సీట్లు కన్నా ఎక్కువ శాతం వచ్చేట్లుగా పిపిపి పద్ధతిలో మెడికల్ కళాశాల నిర్వహణను తీసుకువస్తుంటే దానిపై జగన్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, వాస్తవంగా ఆయనకు పిపిపిపై అవగాహన ఉందా లేదా అని శాప్ చైర్మన్ రవినాయుడు ప్రశ్నించారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణ చేస్తూ అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తే జగన్, తన పార్టీ ఎంపీ గురుమూర్తి పిపిపికి మద్దతుగా ఎందుకు సంతకం చేసారో ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. నారావారిపల్లిలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాలు చేశారని చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. త్వరలో పిపిపి విధానంపై ద్వంద వైఖరి అవలంబిస్తున్న వైసిపికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఆడదాం ఆంధ్రలో జరిగిన అవినీతిపై విజిలెన్స్ విచారణ పూర్తి అయిందని, త్వరలోనే చర్యలు తీసుకొని ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన వారిని జైలుకు పంపిస్తామని స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో తాతయ్య గుంట గంగమ్మ ఆలయం చైర్మన్ నైనారు మహేష్ యాదవ్, శ్రీను యాదవ్, మొదలియార్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ శ్రీధర్, రఫీ, లోకేష్, ఆర్ సి నాయుడు పాల్గొన్నారు.

### క్రీడాంధ్రప్రదేశ్‌గా మార్చటమే సీఎం ధ్యేయం

**ప్రజాశక్తి - క్యాంపస్ :** భారతీయ విద్యాభవన్ శ్రీ వేంకటేశ్వర విద్యాలయంలో శనివారం నిర్వహించిన "స్పోర్ట్స్ స్పెక్ట్రా–2025" కార్యక్రమాన్ని శాప్ చైర్మన్ రవి నాయుడు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని క్రీడా ఆంధ్రప్రదేశ్‌గా మార్చడానికి సీఎం సంకల్పించారని తెలిపారు. క్రీడలకు 3 శాతం విత్‌ఔట్ ఎగ్జామ్‌తో రిజర్వేషన్ ఉద్యోగాలు ఇచ్చే జీవోను విడుదల చేసామన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన భారతీయ విద్యా భవన్ గౌరవ సంచాలకులు, కోశాధికారి డాక్టర్ నడింపల్లి సత్యనారాయణ రాజు మాట్లాడుతూ భారతీయ విద్యా భవన్ క్రీడలకు ప్రోత్సాహం అందిస్తుందని, పాఠశాల విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు పొందడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ డి.పద్మజ, వైస్ ప్రిన్సిపల్స్, పాఠశాల కమిటీ సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# గిరిజన సంస్కృతిని భావితరాలకు అందించాలి

### ఘనంగా ప్రారంభమైన గిరిజన సాంస్కృతికోత్సవాలు




**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** గిరిజన సంస్కృతి, సాంప్రదాయ కళా సంపదను పరిరక్షించి భావితరాలకు అందించాలని పలువురు వక్తలు పిలుపు నిచ్చారు. శనివారం తిరుపతి నగర పరిధిలోని గిరిజన భవన్ వేదికగా బంజారా జన్ సంఘ్ 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గిరిజన జాతీయ సాంస్కృతిక ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిఎం అండ్ హెచ్ ఓ బాలకృష్ణ నాయక్, మాజీ మంత్రి పరసారత్నం, సుప్రీంకోర్టు న్యాయవాది నాగపట్ల రాజగోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన సంక్షేమం కోసం నిరంతరం శ్రమించే బంజారా జన్ సంఘ్ హరి చౌహాన్ నాయక్ గత 8 ఏళ్లుగా జాతీయ స్థాయిలో గిరిజన సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. గిరిజనులు ఉన్నత లక్ష్యంతో చదువుకుని సమాజంలో రాణించాలని, అలానే గిరిజన సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించడంలో భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యలో రాణిస్తున్న గిరిజన ప్రతిభావిద్యార్థులు 40 మందికి మెడల్స్, సర్టిఫికెట్లతో పాటు నగదు బహుమతులు అందజేశారు. కళాకారులను జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన దింసా, కూచిపూడి, భరతనాట్యం, కథాకళి, కోలాటం, శ్రీపద్మావతి కల్యాణం నృత్య రూపకాలు సభికులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గిరిజన భవన్ చైర్మన్ వెంకటరమణ నాయక్, శివానాయక్, వెంకటేష్ నాయక్, వినోద్ రాథోడ్, ప్రియాంక, యతేష్ రాజ్, రమేష్ బాబు కళాకారులు, కవులు, గిరిజన నేతలు పాల్గొన్నారు.

# ఎపిఎస్ పిడిసిఎల్ సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం



**ప్రజాశక్తి - తిరుపతి సిటీ:** ఎపిఎస్పిడిసిఎల్ ఆధ్వర్యంలో ఈనెల 20, 21తేదీల్లో రెండు రోజులపాటు జరిగే సైన్స్ ఎగ్జిబిషన్ శనివారం ప్రారంభమైంది. ఇంధన పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా తిరుపతిలోని ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్లో ఎపిఎస్పిడిసిఎల్ ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ ను ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి, తిరుపతి నియోజకవర్గ శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన అనంతరం శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించి, విద్యార్థుల ప్రతిభను కొనియాడారు. సంస్థ పరిధిలోని తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిషన్‌లో 50కి పైగా ఏర్పాటు చేసిన స్టాల్స్ చూపరులకు విశేషంగా ఆకట్టుకున్నాయి. సైన్స్ ఎగ్జిబిషన్‌ను సందర్శించేందుకు తిరుపతి పరిసర ప్రాంతాల్లోని వివిధ పాఠశాలల నుంచి సుమారు 6వేల మంది విద్యార్థులు తరలివచ్చారు. దీంతో పాత తిరుచానూరు రోడ్డులో విద్యార్థుల సందడి కారణంగా పండగ వాతావరణం నెలకొంది. ఎగ్జిబిషన్లో ప్రతి స్టాల్ లోనూ విద్యార్థుల బృందం ఆయా ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను విశదీకరిస్తూ సందర్శకులకు అవగాహన కల్పించారు.

### విద్యార్థుల ప్రతిభ అద్భుతం

ఇంధన పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా సైన్స్ ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటులో విద్యార్థులు అద్భుత ప్రతిభా పాటవాలను ప్రదర్శించారని ఎపిఎస్పిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి వెల్లడించారు. సోలార్ ప్రాజెక్టులు, అటవీ సంరక్షణ, విద్యుత్ ఉపకరణాల పనితీరు, విద్యుత్ ఉత్పత్తి, సరఫరా తీరు తదితర అంశాలపై కళ్ళకు కట్టినట్లుగా స్టాల్స్ ఏర్పాటు చేయడం విద్యార్థుల ప్రతిభకు నిదర్శనమని కొనియాడారు. నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలని, సైన్స్ ఎగ్జిబిషన్లను సందర్శించడం ద్వారా విద్యార్థులు వివిధ అంశాలపై అవగాహనను మరింతగా పెంపొందించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సైన్స్ ఎగ్జిబిషన్లో స్టాల్స్ ను అద్భుతంగా ఏర్పాటు చేయడంలో సహకరించిన ఉపాధ్యాయులకు, ఎన్జిఓ సంస్థల ప్రతినిధులకు, ఎపిఎస్పిడిసిఎల్ అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

### నేడు మంత్రి గొట్టిపాటిచే బహుమతుల ప్రదానం

ఇంధన పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా సంస్థ పరిధిలోని 9 జిల్లాల్లో విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, వక్తృత్వపు పోటీలు, సైన్స్ ఎగ్జిబిషన్‌లో స్టాల్స్ పోటీలో విజేతలకు ఈనెల 21వతేదీన సాయంత్రం 5 గంటల నుంచి బహుమతుల ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. రాష్ట్ర ఇంధన శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులను ప్రదానం చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్పిడిసిఎల్ డైరెక్టర్లు కె. గురవయ్య, పి. అయూబ్ ఖాన్, చీఫ్ జనరల్ మేనేజర్లు కె. ఆదిశేషయ్య, జె. రమణాదేవి, పి. హెచ్. జానకిరామ్, యం. ఉమాపతి, జనరల్ మేనేజర్లు శ్రీనివాసులు, కృష్ణా రెడ్డి, తిరుపతి సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ వి. చంద్రశేఖర్ రావు, జగదీష్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సి. గంగాధర్ రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జయప్రకాష్, రమేష్, ముని ప్రసాద్, ఆంజనేయులు, స్వాతి, ఎన్జీఓ సంస్థ ప్రతినిధి మధు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి చట్టంలో మార్పు వద్దు



**ప్రజాశక్తి - కెవిబి పురం:** ఉపాధి హామీ చట్టంలో మహాత్మాగాంధీ పేరు తొలగించి, పార్లమెంట్లో పెట్టిన ఉపాధిహామీ బిల్లును ఉపసంహరణ చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రజా సంఘాల పిలుపులో భాగంగా ఈరోజు మండల కేంద్రమైన కేవీబీ పురం, అభివృద్ధి అధికారి కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్ మాట్లాడుతూ ఉపాధిహామీ చట్టం యథా ప్రకారంగా అమలు చేసి కేంద్ర బడ్జెట్లో రెండున్నర లక్షల కోట్లు కేటాయించాలని, కుటుంబానికి 200 రోజులు పని చూపించాలని రోజు వేతనం రూ.600లు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి రాజేశ్వరి, మండల కార్యదర్శి నాగలపురం నాగరాజు మాట్లాడుతూ కనీస సౌకర్యాలు, పనిచేసే చోట ప్రమాదాలు జరిగినా, వేతనాలు ఆలస్యమైనా రాష్ట్ర ప్రభుత్వాలదే బాధ్యతని చెప్పి కేంద్ర ప్రభుత్వం తప్పుకున్నదని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం కెవిబి పురం మండల కార్యదర్శి వరలక్ష్మి మాట్లాడుతూ ఒకేసారి ఉపాధిహామీ చట్టాన్ని రద్దు చేస్తే దేశవ్యాప్తంగా ప్రజలు తిరగబడతారనే ఉద్దేశంతో ఈ చట్టాన్ని పరోక్షంగా నీరుగార్చడానికి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఈకార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పూర్ణమ్మ శివ శంకరి నాగమ్మ భారత జ్ఞానమ్మ వ్యవసాయ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# బూత్ లెవల్ ఏజెంట్ల జాబితా ఇవ్వండి

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్:** నియోజకవర్గ పరిధిలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు బూత్ లెవెల్ ఏజెంట్ల జాబితాను అందజేయాలని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య కోరారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి మాట్లాడుతూ బూత్ లెవల్ ఏజెంట్ల జాబితాను వీలైనంత త్వరగా అందజేయాలని తెలిపారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ – 2026 పై ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. ఇప్పటివరకు వచ్చిన వివిధ దరఖాస్తుల పరిష్కారం గూర్చి ప్రతినిధులకు వివరించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ సురేష్ బాబు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# డీఈ పనితీరుపై ఫిర్యాదు

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్:** డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నిర్లక్ష్యంతో మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని, 25వ డివిజన్లో అభివృద్ధి పనులు కుంటుపడ్డాయని కార్పొరేటర్ నరసింహాచారి శనివారం కమిషనర్ మౌర్యకు ఫిర్యాదు చేశారు. గత ఆరు నెలల నుంచి కౌన్సిల్ సమావేశంలో అభివృద్ధి పనులపై పదేపదే కమిషనర్, ఇంజనీర్ల, అధికారుల దృష్టికి తీసుకువచ్చినా, ఆ డీఈ ఏమాత్రం స్పందించడం లేదని ఆరోపించారు. రాయల్ చెరువు అండర్ బ్రిడ్జి వద్ద ఉన్న మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్లో వంటశాలకు గ్రిల్స్ ఏర్పాటు చేయమని కోరగా, లక్ష రూపాయలు కూడా విలువ కానీ ఈ పనులను డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ముందుకు సాగనివ్వకుండా, విద్యార్థులు ఇబ్బందులు కలిగే విధంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. కౌన్సిల్లో ఏదైనా సమస్య మీద మాట్లాడితే 15వ ఆర్థిక సంఘం నిధులు, లేదంటే 16 ఆర్థిక సంఘం నిధులలో పనులు చేస్తామని చెప్పి తప్పించుకుంటున్నారని విమర్శించారు. ఆ డీఈ ని బదిలీ చేయించాలని, లేని పక్షంలో వేరే డీఈని నియమించాలని కోరారు. మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం మార్చి 18వ తేదీ కాల పరిమితి ముగుస్తున్నందున ఇప్పటికైనా ఆ డీఈ తమ డివిజన్ పనులు వేగవంతం చేసేలా చూడాలని కమిషనర్ మౌర్య, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తులసి కుమార్ల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, వేణులు పాల్గొన్నారు.

# పాత వస్తువుల పునర్వినియోగంతో పర్యావరణ పరిరక్షణ


తిరుపతి, ఉపాధ్యాయ నగర్, శ్రీచక్ర అపార్ట్మెంట్లో డ్రాప్ బాక్స్ ప్రారంభించిన కమిషనర్ మౌర్య, ఎమ్మెల్యే ఆరణి

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్:** నిత్యావసర వస్తువుల పునర్వినియోగం పర్యావరణ పరిరక్షణకు మరింత ఊతం ఇస్తుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పేర్కొన్నారు. రాష్ట్రంలోనే తొలిసారి ఆర్ ఆర్ ఆర్ (రీసైకిల్, రీయూజ్, రెడ్యూస్) ను నగరంలోని అన్ని అపార్ట్మెంట్లలో అమలు చేయనున్నట్లు తెలిపారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్రలో భాగంగా ఉపాధ్యాయ నగర్, శ్రీచక్ర అపార్ట్మెంట్‌లో డ్రాప్ బాక్స్‌ను, వ్యర్థాలను సేకరించే వాహనాన్ని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ ఎన్. మౌర్య, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ, కార్పొరేటర్లు అన్నా అనిత, నారాయణ, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంఘం చైర్మన్ రుద్రకోటి సదాశివం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్రాప్ బాక్స్ నుంచి కలెక్ట్ చేసిన పాత వస్తువులను అనాథ, వృద్ధాశ్రమాలకు, మురికివాడల్లో నివసించే ప్రజలకు అందించి పునర్వినియోగానికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్రలో అందరూ భాగస్వాములు కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పిలుపునిచ్చారు. వ్యర్థాలను ఇంటి వద్దకు వచ్చే మున్సిపల్ సిబ్బందికి ఇస్తే తిరిగి వాటిని వినియోగంలోకి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజనీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

# రహదారిలో వరినాట్లు



**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:** శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని వేడాం రోడ్డు మార్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం వరినాట్లు వేశారు. కొందరు రైతులు తూములను ఆక్రమించి పూడ్చి వేయడం వల్ల నీరు రోడ్లపైకి చేరుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ విధంగా నిరసన తెలిపారు. వెంటనే అధికారులు చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ మార్గంలో పలు దేవాలయాలు, గ్రామాలు ఉండడంతో ప్రజలు భక్తులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. డిసిసి అధ్యక్షులు బాలగురవం బాబు, నియోజవర్గ సమన్వయకర్త తలపా దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఫారెస్ట్ అధికారి రాంబాబుపై చర్యలు తీసుకోండి



సిపిఎం నాయకుల ఆధ్వర్యంలో ఫారెస్ట్ రేంజ్ కార్యాలయం వద్ద నిరసన తెలపుతున్న గిరిజనులు

**ప్రజాశక్తి - వెంకటగిరి:** ఫారెస్ట్ అధికారి రాంబాబుపై చర్యలు తీసుకోవాలంటూ శనివారం సిపియం నాయకుల ఆధ్వర్యంలో వెంకటగిరి ఫారెస్ట్ రేంజ్ కార్యాలయం వద్ద పెట్లూరు గ్రామ పేదలు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం వెంకటగిరి నియోజకవర్గ కన్వీనర్ వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ.. తిరుపతి జిల్లా, వెంకటగిరి మండలం, పెట్లూరు గ్రామ పరిధి సీతారాం ఏచూరి నగర్‌లో నివాసం ఉంటున్న దళితులు, గిరిజనులు, పేదలపై ఫారెస్ట్ అధికారి రాంబాబు దాడి, బెదిరింపులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పెట్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 12–1 లో సుమారు 519 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నదన్నారు. 2011 సంవత్సరం నుండి దళితులు, గిరిజనులు, నిరుపేద ప్రజలు ఆ భూముల్లో నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారన్నారు. ఈ భూమికి సంబంధించి హైకోర్టులో కేసు నడుస్తున్నప్పటికీ, ఫారెస్ట్ అధికారి రాంబాబు శుక్రవారం గ్రామానికి వచ్చి, పేదలు నిర్మించుకున్న ఇళ్ల ఫోటోలు తీసి ఖాళీ చేయాలని బెదిరించాడని ఆరోపించారు. రాంబాబు గ్రామ పెత్తందారులకు తొత్తుగా వ్యవహరిస్తూ దళిత గిరిజనులని, పేదలని ఇబ్బందులకు గురి చేస్తున్నారని మానసికంగా వేధిస్తున్నారన్నారు. ఈఘటపై జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించాలని కోరారు. ఫారెస్ట్ అధికారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాంబాబు పైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ, ఐపీసీ 506 కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఎం పెట్లూరు గ్రామ కమిటీ నాయకులు రాజయ్య, నారాయణ, రత్నమ్మ, ధనలక్ష్మి, నాగమణి, పెంచలయ్య, శ్రీనివాసులు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీలు సొంత ఆదాయం సృష్టించుకోవాలి

**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** గ్రామీణ ప్రాంతాల్లో ఆస్తి, ఇతర పన్నులతో పాటు సొంతంగా పంచాయతీలకు ఆదాయ వనరులను సృష్టించుకోవాలని గూడూరు ఎంపిడిఓ మధుసూదన్ రావు పేర్కొన్నారు. గూడూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులు, విఆర్వోలు, సచివాలయ సిబ్బందికి గ్రామ పంచాయతీలలో సొంత ఆదాయ వనరులు పెంపొందించుకోవడమెలా? అనే అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఓ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో నూతనోత్సాహాన్ని నింపిన ఎస్ఎఫ్ఐ మహాసభలు




**ప్రజాశక్తి - తిరుపతి సిటీ :** బూర్జువా రాజకీయ పార్టీలకు చెందిన పాలకుల అనాలోచిత నిర్ణయాలతో, విశృంఖల పాలనలో యువత ఇటు విద్య, అటు ఉపాధి రెండిటికి దురమావుతోంది. కాషాయ పాలకుల కబంధహస్తాల్లో నలిగిపోతూ, రాష్ట్ర విద్యార్థి లోకం దిక్కుతోచని పరిస్థితులు కొట్టుమిట్టాడుతోంది. ఇలాంటి కష్ట సమయంలో ఎస్ఎఫ్ఐ నిర్వహించిన 25వ రాష్ట్ర మహాసభలు వారిలో నూతన ఉత్సాహాన్ని, స్ఫూర్తిని నింపింది.

తిరుపతి ప్రపంచ వ్యాప్తంగా పరిచయం అవసరం లేని ప్రాంతం. తిరుమల వెంకటేశ్వర స్వామి ఆలయం వల్ల అంతటి ప్రాముఖ్యత సంతరించుకుంది. కానీ మరో ప్రాముఖ్యత కూడా ఈ ప్రాంతం సొంతం. 8 విశ్వవిద్యాలయాలకు నిలయమైన ప్రాంతం. పదుల సంఖ్యలో డిగ్రీ కళాశాలలో, వందల సంఖ్యలో ఇంటర్మీడియట్ కళాశాలలు, వీధికొక పాఠశాలతో వందలాది విద్యాసంస్థలకు ఇది నిలయంగా ఉంది. కనుకనే ఈ ప్రాంతం విద్యా కేంద్రంగా ప్రసిద్ధి చెందుతోంది. ప్రతి ఏడాది వందలాది మంది పట్టభద్రులు తయారవుతున్న ఈ ప్రాంతంలో కూడా పాపిష్టి పాలకుల ధోరణితో, భావి భారత పౌరులైన యువతకు కష్టాలు తప్పడం లేదు. యువత విద్యాభ్యాసానికి అవసరమైన వసతుల కల్పనకు అటు కేంద్ర, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయింపులో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయి. టీటీడీ అనుబంధ విద్యాసంస్థల్లో కొంత నయమే అయినా, సమస్యలు మాత్రం తప్పడం లేదు. అసలే దేశాన్ని పాలిస్తుండేది మత విద్వేషాలు రెచ్చగొడుతున్న కాషాయ పాలకులు, ఒక మతానికి సంబంధించిన టిటిడి అనుబంధ విద్యాసంస్థలలో వారి పెత్తనం ఎలా ఉంటుందో ఇక మాటల్లో వర్ణించనలివి కానిది. పాలకుల అండదండలతో వారి మూకలే కాదు, విద్యాబుద్ధులు, విలువలు నేర్పించాల్సిన గురువులే ఏకంగా అరాచకాలకు పాల్పడుతుండడం శోచనీయం. ఎస్వీయులో సాక్షాత్తు ఓ అధ్యాపకుడే విద్యార్థులపై ర్యాగింగ్ ప్రోత్సహిస్తూ దాడులు జరిపించిన ఘటన చోటుచేసుకోవడం ఇందుకు తార్కాణం. సాంస్కృత సంప్రదయాలను వెలువరించేలా చేయాల్సిన మరో విశ్వవిద్యాలయంలో ఏకంగా ఆధ్యాపకులే ఓ విద్యార్థినిని భయపెట్టి, బెదిరించి తమ కామవాంఛను తీర్చుకొని, గర్భవతిని చేసి, ఆఖరికి విద్యకే దూరం చేసిన అవాంఛనీయ ఘటన యావత్ దేశాన్ని విస్మయానికి గురిచేసింది. ఇలాంటి ఘటనలు మచ్చుకు మాత్రమే, బహిర్గతం కానివి ఎన్నో, విద్యార్థులను మత్తుకు బానిసలను చేస్తూ, ప్రశ్నించిన వారిని దాడులు చేయడం సర్వసాధారణమైపోయింది. ఇక నిత్యం విద్యార్థుల మధ్య గొడవలు సృష్టించడం, కులమత ప్రాంత విభేదాలను ప్రోత్సహించడం షరా మామూలైంది. ఇలాంటి తరుణంలో నిత్యం విద్యార్థులకు అండగా ఉంటూ, వారికి భరోసానిస్తూ, వారిలో ఉద్యమ స్ఫూర్తిని రగిలించి, ప్రశ్నించే తత్వాన్ని నేర్పి యువతను ఉత్సాహపరుస్తున్న ఏకైక విద్యార్థి సంఘం భారత విద్యార్థి సమైక్య (ఎస్ఎఫ్ఐ). ఎస్ఎఫ్ఐ 25వ రాష్ట్ర మహాసభలను ఈనెల 12,13,14 తేదిలలో తిరుపతి కేంద్రంగా నిర్వహించింది. మూడు రోజుల పాటు తిరుపతి కేంద్రంగా జరిగిన రాష్ట్ర మహాసభలకు కేంద్ర నాయకులతోపాటు, రాష్ట్రం నలుమూలల నుంచి విద్యార్థి సంఘ నాయకులు తరలివచ్చి, భవిష్యత్ కార్యాచరణకు ప్రణాళికలు తయారుచేశారు. రాష్ట్ర మహాసభల ప్రారంభం సందర్భంగా మొదటి రోజు తిరుపతి నగరంలో విద్యార్థులు భారీ ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు ఉదయం 8 గంటలకే శ్రీ వెంకటేశ్వర ఆర్ట్స్ కళాశాల ముంగిటకు చేరుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఉద్యమ స్ఫూర్తి గీతాలను ఆలపిస్తూ యువతను ఉత్తేజపరిచారు. సరిగ్గా 11 గంటలకు ఐన్ స్టీన్ విగ్రహం నుంచి వేలాదిమంది విద్యార్థులతో ఎస్ఎఫ్ఐ కేంద్ర నాయకత్వం ముందు నడవగా విద్యార్థుల భారీ ప్రదర్శన ప్రారంభమైంది. క్రమశిక్షణకు మారుపేరైన ఎస్ఎఫ్ఐ వాలంటర్లీ భద్రత నడుమ, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకత్వ పర్యవేక్షణలో ప్రారంభమైన ఈ ర్యాలీ కదిలింది. కామ్రేడ్ కొట్టవిట్టం పెంచులయ్య విప్లవ జ్యోతి వాహనం ముందు కదలగా, దాని వెనకే జాతీయ నాయకుల్లో స్ఫూర్తి దాతలు చిత్రపటాలతో బాలికలు అనుసరించగా, ఎస్ఎఫ్ఐ వాలంటర్లీ వెంటరాగా, డప్పుల దరువులతో, సాంస్కృత కళారూపాలతో, దేశాన్ని, యువత జీవితాన్ని ఛిద్రం చేస్తున్న కాషాయ పార్టీ ఆగడాలను తలపించే వేషధారణలతో, ఎస్ఎఫ్ఐ కేంద్ర నాయకత్వం ముందు నడవగా వారు వెనువెంటే రాష్ట్ర నాయకత్వం, విద్యార్థి లోకం కదిలింది. విద్యార్థి కెరటాలతో మహాసముద్రాన్ని తలపించేలా ఈ భారీ ప్రదర్శన 3 కిలోమీటర్లు దూరం సుమారు రెండు గంటల పాటు సాగింది. పిల్లలనుంచి వృద్ధుల వరకు రెట్టించిన ఉత్సాహాన్ని నింపింది. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో 'విద్య కాషాయీకరణ పోరాటంలో విజయం మనదే' అని అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కార్యదర్శి శ్రీజన్ భట్టాచార్య ఉద్ఘాటించారు. 'అన్నమయ్య కీర్తనలు చెబుతాయి మనమంతా ఒక్కటేనని, మీరెవరు మమ్మల్ని కుల మతాల పేరుతో విడదీయడానికి' అంటూ ఉత్తేజపూరితంగా ప్రసంగించారు. విద్య అనేది హిందూ భావజాలంతో కాదని, ఉన్నత ప్రమాణాలతో ఉండాలన్నారు. అంబేద్కర్, పూలే భావజాలంతో ఎస్ఎఫ్ఐ ముందుకెళుతోందన్నారు. సతీసహగమనాన్ని అంతం చేసేలా పోరాడిన రాజారామ్మోహన్‌రాయి వారసులమంటూ విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. కాషాయ పాలకుల ఆగడాలను ఎండగట్టారు. అనంతరం కచ్చపి ఆడిటోరియం వేదికగా 25వ రాష్ట్ర మహాసభల ప్రతినిధుల సభ ప్రారంభమయ్యింది. ప్రజాస్వామ్యాన్ని మోడీ, అమిత్ షా ఖూనీ చేస్తున్నారన్నారు. దేశంలో ఉచిత విద్య అందడం లేదని, కేజీ నుంచి పీజీ వరకు కోట్లాది రూపాయలు డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. ఒక్క పీజీ సీటుకి కోటి రూపాయలు ధర పెట్టడంతో సామాన్య మధ్య, పేద వర్గాలు చదువుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. విద్యా వ్యవస్థను ఆర్ఎస్ఎస్ బిజెపి కాషాయీకరణ చేశాయని, దీనివల్ల సామాన్య మధ్య తరగతి పిల్లలకు ఉచిత విద్య అందడం లేదన్నారు. కార్పొరేట్ సంస్థల కోసం ఉచిత విద్యను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. దేశంలో రాష్ట్రంలో మతవిద్వేషాలు రెచ్చగొట్టి, పబ్బం గడుపుకుంటున్న కాషాయ పార్టీకి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మద్దతునిస్తూ, వారి ఆదేశాలను తప్పకుండా అమలు చేసేలా వ్యవహరించడం విడ్డూరంగా ఉందని ధ్వజమెత్తారు. ఇలాంటి తరుణంలో విద్యార్థి లోకం అప్రమత్తంగా వ్యవహరించి, నరనరాన చైతన్యాన్ని నింపుకొని, బూర్జువా పాలకుల ఆగడాలను నిలదీయాలని, అవినీతిపరుల భరతం పట్టి, బావి భారత దేశాన్ని సర్వతోముఖాభివృద్ధిగా చేసేందుకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. పోరాడితే పోయేదేం లేదు బానిస సంకెళ్లు తప్ప, ఉద్యమ వీరులు ఇచ్చిన ఈ నినాదాన్ని పుణికిపుచ్చుకొని, విద్యార్థి లోకం ముందుకెళ్లాలని.. విద్యార్థుల్లో చైతన్యాన్ని నింపారు. ఈ సందర్భంగా పలు తీర్మానాన్ని ప్రవేశపెట్టి, ఏకగ్రీవంగా ఆమోదించారు. చివరి రోజు రాష్ట్ర ఎస్ఎఫ్ఐ నూతన నాయకత్వాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొని ప్రకటించారు. మూడు రోజులపాటు తిరుపతి కేంద్రంగా నిర్వహించిన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని, స్ఫూర్తిని నింపాయనడంలో అతిశయోక్తి లేదు.

## హాస్టల్‌లో ముస్తాబు కార్యక్రమం

**ప్రజాశక్తి -ఏర్పేడు :** ఏర్పేడు బిసి సంక్షేమ వసతి గృహాన్ని జిల్లా బిసి సంక్షేమం, సాధికారత అధికారి యం.భరత్ కుమార్ రెడ్డి, తిరుపతి సహాయ బిసి సంక్షేమ అధికారిణి జ్యోత్స్నలు శనివారం తనిఖీ చేశారు. హాస్టల్‌లో ముస్తాబు కార్యక్రమ పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల వ్యక్తిగత, పరిశుభ్రత, ఆరోగ్యం పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలలో అమలు చేస్తున్న వంద రోజుల పాఠ్య ప్రణాళిక కార్యక్రమం ప్రకారం చదివి ఈ ఎడాది మంచి ఫలితాలు సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పల్లా వెంకటేశ్వర్లు, వసతి గృహ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయం.. ఆరోగ్యదాయకం

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్:**తిరుపతి రూరల్ వెలుగు మండల మహిళా సమాఖ్యతో ప్రకృతి వ్యవసాయ తిరుపతి రూరల్ మండల శాఖ అనుసంధాన సమావేశం మండల ఏపీఎం నాగేశ్వరరావు, దుర్వాసులు నాయుడు, వారి బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. శనివారం జరిగిన ఈ సమావేశంలో తిరుపతి జిల్లా పథక సంచారకులు ఏ.షణ్ముగం ప్రతి కుటుంబం పెరటి తోటలు పండించి స్వచ్ఛ మైన కూరగాయలు తినాలని, భూమి ఉన్న రైతులు ప్రతి పంటను ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించాలని సూచించారు. ఎస్ ఆర్ పిభాను మూర్తి మాట్లాడుతూ దేశ అభివృద్ధికి మహిళా సంఘాలే కీలకమన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్లే భాధ్యత వారు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు, మహిళా రైతులు, అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్ అధికారిలు పాల్గొన్నారు.

## అటవీశాఖలో వాహనాలకు వేలంపాట

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** అటవీ శాఖ తిరుపతి సర్కిల్ పరిధిలో ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులలో సీజ్ చేయబడి కోర్టు ద్వారా క్లియరెన్స్ పొందిన వాహనాలకు అధికారులు శనివారం కపిలతీర్థం వద్ద ఉన్న అటవీశాఖ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించారు. ముందస్తుగా ఇచ్చిన నోటీసు ప్రకారం 375 వాహనాలకు సీల్డ్ టెండర్లను ఔత్సాహికుల ముందు ఓపెన్ చేశారు. ఈ వేలం ప్రక్రియకు కడప, చిత్తూరు, తిరుపతి, రైల్వే కోడూరు తదితర ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో వాహనాలను దక్కించుకోవడానికి ఔత్సాహికులు పోటీపడ్డారు. కాగా అటవీ శాఖ అధికారులు కొన్ని వాహనాలను బహిరంగ వేలంలో ఉంచలేదని ప్రచారం సాగుతోంది. వేలం ప్రక్రియకు సంబంధించి ఎన్ని వాహనాలు వేలం ద్వారా పొందారు, ఎంత నగదు ప్రభుత్వానికి జమచేసిన వివరాలు మీడియాకు తెలపాల్సి ఉంది.

## వైసీపీ కోటి సంతకాల నాటకం : రాగల

**ప్రజాశక్తి - క్యాంపస్ :** పి పి పి పబ్లిక్ ప్రవేట్ పార్టనర్షిప్, విధానంపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆడుతున్న వీధి నాటకాలు ఆడుతోందని, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద గౌడ్ విమర్శించారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు ప్రవేట్, ప్రభుత్వ భాగస్వామ్యంతో పిపిపి మెడికల్ కాలేజీలను నిర్మించి, పేద విద్యార్థులకు వైద్య విద్యలో అవకాశాలు పెంచే దిశలో అడుగులు వేస్తుంటే దానిని జీర్ణించుకోలేని వైసీపీ అసత్య ప్రచారాలు చేస్తూ ఢిల్లీలో పిపిపి కి ఆమోదం ఇస్తూ.. గల్లీలో కోటి సంతకాల పేరుతోటి వీధి నాటకాలు ఆడుతోందని అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా జగన్మోహన్ రెడ్డి వ్యవహరించాలని రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు.


## రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు స్వాతి, మాన్విత

**ప్రజాశక్తిబి - పిచ్చాటూరు:** పిచ్చాటూరు హై స్కూల్ విద్యార్థులు స్వాతి, మాన్విత సైన్స్ ఫెయిర్ ప్రాజెక్ట్‌లో రాష్ట్ర స్థాయిలో ఎంపికయ్యారనీ జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు గిరి ప్రకాష్ తెలిపారు. వారిని ప్రోత్సహించిన ఎనిమిదవ తరగతి గైడ్ టీచర్ భారతిని అభినందించారు. ఎంపికైన విద్యార్థులకు పిచ్చాటూరు ఎంఈఓ డాక్టర్ హేమమాలిని ధ్రువీకరణ పత్రం అందించి అభినందించారు.

## అంగన్వాడీ వర్కర్లకు 5జి ఫోన్లు పంపిణీ


**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** పుత్తూరు, ఐసిడిఎస్ కార్యాలయంలో పుత్తూరు, వడమాల పేట మండలాలకు చెందిన 134 మంది అంగన్వాడీ టీచర్లకు ఆధునిక 5జీ స్మార్ట్ ఫోన్లను ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల పనితీరును మెరుగుపరచడానికి ఈ ఫోన్లు ఎంతగానో దోహదపడతాయన్నారు. లబ్దిదారుల ముఖ గుర్తింపుతో సరకుల పంపిణీ జరుగుతుందని, అవినీతికి ఆస్కారం ఉండదని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మెరుగైన సేవలను అందించడం, పిల్లల పోషణ, బరువు, ఎత్తు కొలతలు వంటి వాటిని నమోదు చేయడం సులభం అవుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి రాష్ట్ర మొదలియార్ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ ఎన్ ఎన్ ధనపాల్, మాజీ మున్సిపల్ చైర్మన్ బిసిఆర్ యుగంధర్, ఏ ఆనంద్, జనసేన పార్టీ ఇంచార్జ్ మెరుపుల మహేష్, ఐసిడిఎస్ ఇన్చార్జి సూపర్వైజర్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ డివిజన్ ప్రెసిడెంట్‌గా సుధీర్ రెడ్డి



**ప్రజాశక్తి - వరదయ్యపాలెం:** ఆంధ్ర ప్రదేశ్ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్ ప్రెసిడెంట్‌గా వరదయ్యపాలెం మండలం తహశీల్దార్ సుధీర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన మాట్లాడుతూ 2025 -2028 మూడు సంవత్సరాల పదవీకాలంలో రెవెన్యూ ఉద్యోగుల సమస్యలపై ఉన్నతాధికారుల చొరవతో త్వరగా పరిష్కారం అయ్యే విధంగా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఉన్నతాధికారులు, దిగువ స్థాయి ఉద్యోగస్తుల మధ్య సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు సకాలంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. కార్యాలయం సిబ్బంది, అలాగే అసోసియేషన్ ఎన్నికైన వివిధ విభాగాల సభ్యులు తాసిల్దారుని పూలమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సమన్వయంతో గ్రామాభివృద్ధి సాధించాలి



**ప్రజాశక్తి - నాయుడుపేట:** అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసే గ్రామాభివృద్ధి సాధించవచ్చని నాయుడుపేట ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల స్థాయి ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి మాట్లాడుతూ సుస్థిర సర్వే పూర్తి చేసి అర్హులైన వారికి ఆస్తి హక్కు పత్రాలను అందజేయాలని అన్నారు. ప్రతి పంచాయతీలో ఇంటి పన్ను, కొళాయి పన్ను బకాయి ఉన్న పన్నులను సకాలంలో వసూలు చేసి గ్రామాభివృద్ధికి వినియోగించాలని సూచించారు. అలాగే పంచాయతీల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచి, సర్వస్వచ్ఛతలను పాటించాలని, ఇంటింటి చెత్తను సేకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట ఎంపీడీఓ కె.సురేష్ బాబు, ఈ ఓ పి ఆర్ డి భువనేశ్వర శర్మ, జి ఎస్ డబ్ల్యు ఎస్ అధికారి ఎ. ..., అసిస్టెంట్ లు,ఇంజనీరింగ్ అసిస్టెంట్ లు, సర్పంచ్‌లు,వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

## సృజనాత్మకతను వెలికి తీసేందుకే సైన్స్ ఫెయిర్‌లు



**ప్రజాశక్తి - నాయుడు పేట:**విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసి,శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సైన్స్ ఫెయిర్ లు నిర్వహిస్తుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు.శనివారం నాయుడుపేట పట్టణంలోని జడ్పీ హైస్కూల్లో జరిగిన జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను సాంకేతిక రంగంలో ఉపయోగించేలా సైన్స్ పెయిర్ లు ఉపయోగపడతాయని అన్నారు.జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలు జిల్లా కేంద్రమైన తిరుపతిలో నిర్వహిస్తుంటారని ఇప్పుడు మా నియోజకవర్గమైన నాయుడుపేటలో నిర్వహించడం ఆనందంగా ఉందని అన్నారు. విద్యార్థులు ఇంటర్నెట్ ను భవిష్యత్తుకు ఉపయోగించు కోవాలన్నారు.రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ శాస్త్ర సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నారని తెలిపారు.విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడాల సైన్స్ పెయిర్ లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాకు అసెంబ్లీ నిర్వహించి విద్యార్థులకు అసెంబ్లీపై అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. నాయుడుపేట పట్టణంలో జరిగిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ కార్యక్రమం 34 మండలాల నుండి 300 మంది ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో 500 మంది విద్యార్థులు 268 సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించడం అభినందనీయం అన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన వినూత్న శాస్త్రీయ ప్రయోగాలను పరిశీలించిన ఎమ్మెల్యే వారిని అభినందించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల.సుబ్రహ్మణ్యం, నాయుడుపేట ఏఎంసీ చైర్మన్,జనసేన పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గం ఇన్చార్జి ఉయ్యాల.ప్రవీణ్, ఎమ్మెల్సీ బల్లి.కళ్యాణ చక్రవర్తి,శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల.సుబ్బారావు,నాయుడుపేట ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు జివిఆర్ నాయుడు,నాయుడుపేట రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ఆదవరం నాగురయ్య,సెక్రటరీ బట్ట.సుబ్రహ్మణ్యం,తెలుగుదేశం పార్టీ నాయకులు సన్నారెడ్డి.చంద్రశేఖర్ రెడ్డి ,మైలారి.రాజశేఖర్,పోట్లపూడి.రాజేష్,నాగిరెడ్డి.చంద్రశేఖర్ రెడ్డి,పలుకూరు. ముత్యాలయ్య,, అవధానం.సుధీర్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

## నేడు ఘనంగా జగన్ జన్మదిన వేడుకలు

**ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ:** ఆదివారం బిఎన్ కండ్రిగ మండలంలో వైయస్సార్సీపీ కార్యాలయంలో ఘనంగా మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించనున్నట్లు వైసీపీ కన్వీనర్ రవి నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సత్యవేడు వైస్సార్సీపీ ఇంచార్జ్ నూకతోటి రాజేష్ ఈ కార్యక్రమంలో పాల్గొని, కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమం ప్రారంభిస్తారని తెలిపారు. మండలంలోని వైయస్సార్సీపీ నాయకులు, అభిమానులు, పార్టీ కార్యకర్తలు, యువకులు, విలేకరులు, మండల ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరై, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల కన్వీనర్ మణి నాయుడు కోరారు.

## కౌటిల్య విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాలు

**ప్రజాశక్తి - క్యాంపస్ :** డిసెంబర్ 19 రోజున విడుదలైన స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా ప్రొబేషనరీ ఆఫీసర్ తుది ఫలితాలలో తిరుపతి ఎం.ఆర్ పల్లి సర్కిల్ వద్ద వున్న కౌటిల్య ఇన్స్టిట్యూషన్ ' సంస్థకి చెందిన విద్యార్థిని కొమ్మలూరు వెంకటసాయి గాయత్రి విజయం సాధించింది. ఆమె కౌటిల్య సంస్థలో బ్యాంకు కోచింగ్ తీసుకొందని ఆ సంస్థ డైరెక్టర్ శ్రీధర్ వెల్లడించారు. ఈ పరీక్ష విషయంలో కేవలం 540 దేశ వ్యాప్త పోస్టు ఖాళీలకు, ఈ పరీక్షకు దేశ వ్యాప్తంగా 6 లక్షలకు పైగా అభ్యర్థులు పోటీపడ్డారని వివరించారు. ఈ పరీక్ష ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ – మూడు దశలు 2025 ఆగష్టు నుండి నిర్వహించబడ్డాయన్నారు. ఈ వారంలో యుపిఎస్సి విడుదల చేసిన ఇంజనీరింగ్ సర్వీస్స్ ఎగ్జామ్ ఈ.ఎస్.ఈ తుది ఫలితాల్లో కౌటిల్య విద్యార్థి జి.సాయి గౌతమ్ మెకానికల్ ఇంజనీరింగ్‌లో ఆల్ ఇండియా 14 వ ర్యాంకు సాధించాడు. ఇతను కౌటిల్యలో ఈ.ఎస్.ఈ ఇంటర్వ్యూ శిక్షణ పొందాడని శ్రీధర్ తెలిపారు. కౌటిల్య విద్యార్థులు ఈ సంవత్సరంలో అనేక సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగాలు – స్టాఫ్ సెలక్షన్ కమిషన్, ప్రభుత్వ బ్యాంకులు, రైల్వేలలో ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ఈ విద్యార్థులను కౌటిల్య సంస్థ డైరెక్టర్ శ్రీధర్, ఫ్యాకల్టీ, సీనియర్ మేనేజర్ ఎన్.ఎస్.రెడ్డి తదితరులు అభినందించారు.

## విద్యా పరిశోధనపై ఫ్యాకల్టీ అభివృద్ధి కార్యక్రమం

**ప్రజాశక్తి - క్యాంపస్ :** తిరుపతి, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలోని మాలవ్య మిషన్ ఉపాధ్యాయ శిక్షణా కేంద్రం డిసెంబర్ 15 నుంచి డిసెంబర్ 20 వరకు విద్యా పరిశోధనపై ఎస్.పి.ఎస్.ఎస్ తో నిర్వహించిన ఆరు రోజుల ఫ్యాకల్టీ అభివృద్ధి కార్యక్రమం శనివారంతో ముగిసింది. ప్రముఖ రిసోర్స్ పర్సన్లు కంప్యూటర్ ప్రయోగశాలలో ఆచరణాత్మక సెషన్లతో పాటు ప్రభావవంతమైన పిపిటి ఆధారిత ఉపన్యాసాలను, ఎస్.పి.ఎస్.ఎస్‌లో విద్యా పరిశోధన పద్ధతి, ఆచరణాత్మక శిక్షణపై విలువైన విషయాలను వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్. మురళీధర రావు, అదనపు డైరెక్టర్ డాక్టర్ ఎ. చారుకేష్, వివిధ ప్రాంతాల నుంచి 45 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పరిశోధన పండితులు పాల్గొన్నారు.

## నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలి

**ప్రజాశక్తి - క్యాంపస్ :** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో 2023 సంవత్సరం చివరిలో న్యాక్ కమిటీ పేరుతో పెద్ద ఎత్తున నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని తక్షణమే దానిపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ఎస్వీయు ఇంచార్జ్ చిన్న ఉపకులపతి ఆచార్య టాటా నర్సింగరావుకి వినతిపత్రం చేశారు. ఈ సందర్భంగా చిన్న మాట్లాడుతూ న్యాక్ పేరుతో ఇంజనీరింగ్ సెక్షన్ నుండి దాదాపు నాలుగు కోట్ల రూపాయలు నామినేటెడ్ పద్ధతుల్లో పనులు చేశారని, అయితే ఆ పనులు వాస్తవ రూపంలో అయినా ఖర్చులకి యూనివర్సిటీ నుంచి తీసుకున్న నిధులకు పొంతన లేదని ఐదు లక్షల రూపాయలు ఖర్చు అయితే పది లక్షల రూపాయలు నిధులు తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మొత్తంగా కోటిన్నర రూపాయలు విలువ గలిగిన పనులు చేసి నాలుగు కోట్ల రూపాయలు నిధులు దండుకున్నారని తెలిపారు. న్యాక్ కమిటీ కన్వీనర్ గా ఉన్న ఆచార్య శ్రీనివాసులు రెడ్డి, ఆ కమిటీలోని ఇతర ఆచార్యుల ద్వారా మూడు కోట్ల రూపాయలు ఖర్చు చేశారని తెలిపారు. అయితే ఇందులో జూవాలాజి విభాగం శ్రీనివాసులురెడ్డి చేసినటువంటి ఖర్చులు వాస్తవానికి దూరంగా ఉన్నాయని శ్రీనివాసులు రెడ్డి ద్వారా జరిగిన ఖర్చులలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని తెలిపారు. మరో రెండు కోట్ల రూపాయలు వివిధ రకాలైన అదనపు ఖర్చులు చేశారన్నారు. ఈ ఖర్చులపై విచారణ జరిపించి వాస్తవాలు వెలికి తీసి దుర్వినియోగానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకొని వారి దగ్గర నుంచి ఈ సొమ్మును రికవరీ చేయాలని కోరారు. అధికారులు స్పందించకపోతే విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకొని వెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసింహులు, ఇక్బాల్, రవి,శశి,కిషోర్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

### ఆస్టర్ నారాయణాద్రిలో

## విజయవంతంగా 800 సీటీవీఎస్ శస్త్రచికిత్సలు



**ప్రజాశక్తి - తిరుపతి సిటీ:** తిరుపతి, ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ హృదయ వైద్యంలో మరో చారిత్రక ఘట్టాన్ని నమోదు చేసింది. కార్డియోథొరాసిక్ అండ్ వాస్క్యులర్ సర్జరీ (సీటీవీఎస్) విభాగంలో 800 విజయవంతమైన శస్త్రచికిత్సలు పూర్తి చేసి, రాయలసీమ ప్రజలకు అత్యాధునిక హృదయ చికిత్సలు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ సందర్భంగా జరిగిన ఆ ఆసుపత్రి వైద్య బృందం శనివారం తమ అనుభవాలను, సేవా ప్రయాణాన్ని మీడియాతో పంచుకున్నారు. సీటీవీఎస్ సర్జన్ డాక్టర్ త్రిలోక్ మాట్లాడుతూ “800 సీటీవీఎస్ శస్త్రచికిత్సలు పూర్తి చేయడం మా బృందానికి గర్వకారణమన్నారు. ఆధునిక సాంకేతికత, అనుభవజ్ఞులైన వైద్య బృందం, బలమైన క్రిటికల్ కేర్ మద్దతుతో, క్లిష్టమైన హృదయ శస్త్రచికిత్సలను కూడా విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సునంద కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్‌లో మెట్రో స్థాయి హృదయ చికిత్సలు అందించడం తమ లక్ష్యమని తెలిపారు. 800 సీటీవీఎస్ సర్జరీలు పూర్తి చేయడం, ఆసుపత్రి వైద్య ప్రమాణాలకు నిదర్శనమని, రాయలసీమ ప్రజలకు నాణ్యమైన, అందుబాటులో ఉన్న వైద్యం అందించడమే తమ సంకల్పంమని తెలిపారు. మరో మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ వి ప్రసాద్ మాట్లాడుతూ సీటీవీఎస్ విభాగం సాధించిన ఈ మైలురాయి, ఆసుపత్రిలోని టీమ్ వర్క్‌కు, క్రమశిక్షణకు, వైద్య నైపుణ్యానికి ప్రతీకన్నారు. చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ ముని మాట్లాడుతూ ఆధునిక మౌలిక సదుపాయాలు, అనుభవజ్ఞులైన వైద్యులు, 24/7 క్రిటికల్ కేర్ మద్దతు వల్ల ఇలాంటి పెద్ద సంఖ్యలో విజయవంతమైన హృదయ శస్త్రచికిత్సలు సాధ్యమయ్యాయినట్లు తెలిపారు. డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ ప్రతిమ,సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్కేస్ నెక్స్ట్ జెన్ స్కూల్‌లో మెగా పేరెంట్స్ మీటింగ్



**ప్రజాశక్తి - చంద్రగిరి:** చంద్రగిరి మండలం, రంగంపేట, వినాయక క్యాంపస్‌లో ఆర్కేస్ నెక్స్ట్ స్కూల్ నిర్వహించిన మెగా పేరెంట్స్ మీటింగ్‌లో సమకాలీన అంశాలు విద్యార్థులు నడవడికలు ఉపాధ్యాయులు యొక్క వృత్తి ధర్మ నియమ నిబంధనలు వివరిస్తూ తల్లిదండ్రులు పిల్లల పట్ల విద్యాసంస్థల పట్ల ఎలా మసులుకోవాలో సూచిస్తున్న ఆర్కేనెక్స్ట్ జెన్ స్కూల్ చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి తెలిపారు. పిల్లలు క్రమశిక్షణతో మెలగాలని అలా మెలిగిన పిల్లలు దేశ భవిష్యత్తుకు నాంది అని డైరెక్టర్ ఆర్కే విమల తెలిపారు. సంస్థ అకాడమిక్ డైరెక్టర్ శివ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పిల్లలు టెక్నాలజీతో పాటు ఎదగాలని అదేవిధంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశనుమూలల చాటే విధంగా తల్లిదండ్రులను గౌరవాన్ని పెంపొందించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో అసోసియేట్ డైరెక్టర్ కోటపాటి సురేంద్రబాబు మాట్లాడుతూ పెద్దలపై గౌరవం, సమాజంలో తన వంతు పాత్ర ఎలా ఉండాలో పిల్లలకు చక్కగా వివరించారు. సంస్థ కోఆర్డినేటర్ జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రుల సూచనలను సరైన మార్గంలో అవలంబిస్తే పిల్లల భవిష్యత్తు బాగుంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యాఖ్యాతగా వివరించిన చిక్కిలి వినయ శ్రీ మాట్లాడుతూ తరగతి గదిలోనే దేశ భవిష్యత్తు నిర్మితమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలు ఆహ్లాదకరమైన వాతావరణంలోలి మెగా పేరెంట్స్‌లి 2.0 నిర్వహించడం జరిగిందని పాఠశాల కరస్పాండెంట్ తెలిపారు.

## ఉత్తమ రీజినల్ కౌన్సిలర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్



**ప్రజాశక్తి - తిరుపతి టౌన్ :** విశాఖపట్నంలో శనివారం జరిగిన వాకర్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్–2025 అధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బెస్ట్ రీజినల్ కౌన్సిలర్‌గా తిరుపతికి చెందిన జనసేన నేత ఆర్కాట్ కృష్ణప్రసాద్ ఎన్నికయ్యారు. రాయలసీమలో వాకర్స్ అసోసిషన్లను బలోపేతం చేయడంలో ఆర్కాట్ కృష్ణప్రసాద్ ఎంతో కృషి చేసారని అంతర్జాతీయ వాకర్స్ అధ్యక్షురాలు ప్రభావతి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ మానవసేవయే మాధవసేవలో భాగంగా వాకర్స్ కు మెడికల్ క్యాంప్‌లు, ఆశ్రమాలకు సహాయం చేయడం పలు రకాలైన సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవార్డుతో తనపై బాధ్యత మరింత పెరిగిందన్నారు.

### పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ అవార్డులు



**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** విశాఖపట్నంలో జరిగిన 34వ వాకర్స్ ఇంటర్నేషన ల్ కన్వెన్షన్ మీటింగ్‌లో ఉత్తమ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా రావిళ్ల మాధవ నాయుడు, ఉత్తమ వాకర్స్ అసోసియే షన్‌గా పుత్తూరు వాకర్స్ అసోసియేషన్‌కు అవార్డు లను ప్రకటించా రు. ఈ అవార్డులను డిస్ట్రిక్ట్ 302 ట్రెజరర్ పి.ఎస్. కృష్ణమరాజు, పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ సెక్రటరీ చల్లా ముని కృష్ణయ్యలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కోనేటి రవిరాజు, యువరాజు పాల్గొన్నారు.

## సాధారణ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం




**ప్రజాశక్తి - నాయుడుపేట:** నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ పరిధిలోని అంబేద్కర్ భవన్లో పట్టణ మున్సిపాలిటీ చైర్ పర్సన్ కటకం.దీపిక ఆధ్వర్యంలో సాధారణ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ ఎస్.కె పజిలుల్లా అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని కొన్ని సమస్యల గురించి పట్టణ అభివృద్ధికి చేపట్టవలసిన కార్యక్రమాల గురించి చర్చించారు. గతవారం 12వ తేదీ నిర్వహించవలసిన ఈ కౌన్సిల్ సమావేశాన్ని వైసిపి కౌన్సిలర్లు,చైర్ పర్సన్, వైస్ చైర్మన్ కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వని కారణంగా మున్సిపల్ కమిషనర్ పజిలుల్లా పై వ్యతిరేకతతో సమావేశాన్ని బాయ్ కట్ చేయడంతో సమావేశం వాయిదా పడింది. అనంతరం ఆ సమావేశాన్ని శనివారం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ జలదంకి వెంకట కృష్ణారెడ్డి, మునిసిపల్ కో ఆప్షన్స్ సభ్యులు చదలవాడ.కుమార్ కౌన్సిలర్లు దారా.రవిబాబు,పాలేటి.నాగార్జున మరి కొంతమంది కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## కల్పిత వీడియోలతో వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీస్తున్నారు: సురేష్

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** నా రాజకీయ ఎదుగుదలను జీర్ణించుకోలేని జనసేన పార్టీ నాయకుడు కిరణ్ రాయల్ తన వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీయడానికి, రాజకీయంగా అణగతక్కువడానికి అసత్య కల్పిత వీడియోలను సృష్టించి సామాజిక మాధ్యమాల వేదికగా వైరల్ చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడంపై రాను కోర్టును ఆశ్రయించినట్లు వైసిపి మీడియా ప్యానలిస్ట్ పసుపులేటి సురేష్ అన్నారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ఒక ప్రముఖ టీవీ ఛానల్ లో చర్చలో పాల్గొన్న సమయంలో కిరణ్ రాయల్ తనపై ఆరోపణలు చేయడంతో తాను కూడా ప్రతిఘటించి అతనిపై వ్యాఖ్యలు తీవ్రంగా చేయడం జరిగిందన్నారు. ఉద్దేశపూర్వకంగా వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించడమే కాకుండా రాజకీయంగా, సామాజిక ప్రతిష్టలు తీవ్రంగా తీయాలని దురుద్దేశంతో కిరణ్ రాయల వ్యవహరిస్తున్నాడని, టిటిడికి చెందిన వాణిజ్య సముదాయాల వద్ద జరగనిది జరిగినట్లుగా సృష్టించి సమాజంలో ప్రతిష్టను దిగజార్చు ఎలా మానసికమైన ఇబ్బందికి గురి చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో తాళ్లపాక మహేష్, కోటి, రమణారెడ్డి, బాలాజీ పాల్గొన్నారు.

## అష్టలక్ష్మి పూజలో హిమాచల ప్రదేశ్ గవర్నర్



**ప్రజాశక్తి - రామచంద్రపురం :** మండలంలోని చుట్టుగుంట రామాపురం గ్రామ సమీపాన ఉన్న శ్రీ బ్రహ్మర్షి గురూజీ ఆశ్రమంలో అష్టలక్ష్మిల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం హిమాచల ప్రదేశ్ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ఆశ్రమానికి విచ్చేశారు. ఆశ్రమ నిర్వాహకులు, అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆశ్రమంలోని కళ్యాణ మండపంలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల, పీఠాధిపతి గురువానంద గురూజీతో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు సరళ్లా బోత్ర, హిందు, రాంప్రకాష్, సుభాష్ జైన్, వేద పండితులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా అమర రాజా గ్రూప్ ఫౌండేషన్ డే వేడుకలు



**ప్రజాశక్తి - రేణిగుంట:** విభిన్న రంగాల్లో విశేష సేవలందిస్తూ ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిన అమర రాజా గ్రూప్ 40వ ఫౌండేషన్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించినట్లు అమర రాజా గ్రూప్ చైర్మన్ జయదేవ్ గల్లా తెలిపారు. ఫౌండేషన్ డే వేడుకల సందర్భంగా, సమాజాభివృద్ధి పట్ల తన నిబద్ధతను చాటుతూ అమర రాజా గ్రూప్ 'అమర రాజా బెటర్ వే అవార్డ్స్' విజేతలను ప్రకటించింది. ఈ కార్యక్రమం ద్వారా ఎంపికైన ముగ్గురు గ్రామీణ వ్యాపార సంస్థలకు ఒక్కొక్కరికి రూ.3 లక్షల నగదు బహుమతితో పాటు, వారి వ్యాపారాభివృద్ధికి ఒక సంవత్సరం పాటు సహకారం అందించనున్నట్లు వెల్లడించింది. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా భవిష్యత్తు వైపు దృఢంగా ముందుకు సాగుతున్నామని జయదేవ్ గల్లా తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా, అమర రాజా గ్రూప్ దాదాపు 300 మంది ఉద్యోగులకు ఛాంపియన్ అవార్డ్స్ లాంగ్ సర్వీస్ అవార్డ్స్ అందించి సత్కరించింది. అలాగే, సంస్థకు గత నాలుగు దశాబ్దాలుగా సహకారం అందిస్తున్న సమీప గ్రామాల పంచాయతీ నాయకులను అభినందించారు. అమర రాజా ఉద్యోగుల పిల్లలకు బెస్ట్ స్టూడెంట్ అవార్డ్స్ అందించారు. ఈ కార్యక్రమానికి అమర రాజా గ్రూప్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ రామచంద్ర నాయుడు గల్లా, మాజీ మంత్రి గల్లా అరుణ కుమారి, అమర హాస్పిటల్ ఎండీ డాక్టర్ రమాదేవి గౌరినేని, అమర రాజా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు హర్షవర్ధన్ గౌరినేని, విక్రమాదిత్య గౌరినేని, గ్రూప్ ఆపరేషన్స్ హెడ్ నరసింహులు నాయుడు, పలువురు ఉన్నతాధికారులు, ఉద్యోగులు సమీప గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





# క్రైం న్యూస్

## ప్రమాదంలో సచివాలయ సర్వేయర్ మృతి



తులసి రామ్ (ఫైల్ ఫోటో)

**ప్రజాశక్తి - సత్యవేడు:** చిత్తూరు జిల్లా, నగిరి మండలం దేశమ్మ దేవాలయానికి సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సచివాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తున్న ఆరూరు తులసి రామ్(31) మృతి చెందాడు. ఆయన సత్యవేడు మండలం, మదనంబేడు గ్రామ సచివాలయంలో పనిచేస్తున్నాడని సమాచారం. ప్రస్తుతం తులసిరామ్ డిప్యుటేషన్‌పై విజయపురం మండల సచివాలయ సర్వేయర్‌గా పని చేస్తున్నారు. శుక్రవారం విధుల నిర్వహణకు ఇంటి నుండి వెళుతున్న నేపథ్యంలో దేశమ్మ దేవాలయం సమీపంలో రోడ్డుపై వేగంగా వెళుతున్న టాటాఏస్ వ్యాన్‌ను తప్పించబోయి ప్రమాదానికి గురయినట్లు స్థానికుల తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు మృత దేహాన్ని ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. తులసి రామ్‌కు ఇటీవలే పెళ్లయి, భార్య, 5 నెలల పాప ఉన్నట్లు స్థానికుల తెలిపారు. తులసీరామ్ మృతి పట్ల స్థానిక తహశీల్దారు రాజశేఖర్, సత్యవేడు ఎంపీడీవో చంద్రశేఖర్, పరిపాలన అధికారి త్రివిక్రమ రావు, పంచాయతీ సెక్రటరీలు, సర్వేయర్లు నివాళి అర్పించారు.

## అదుపు తప్పి దుకాణంలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్



**ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ :** తిరుపతి జిల్లా బిఎన్ కండ్రిగ మండలం, శ్రీకాళహస్తి–తడ ప్రధాన రహదారి వద్ద, నెలవాయి గ్రామంలో జయశంకర్ అనే వ్యక్తి వ్యాపార దుకాణంలోకి ఓవర్ లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్ అదుపుతప్పి దూసుకెళ్లింది. వివరాల్లోకి వెళితే శ్రీకాళహస్తి ఇటుక బట్టీల నుండి వరదయ్యపాలెంకు ఇటుకల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ వీధి కుక్కలు, కోడి పిల్లలు రోడ్డుకు అడ్డు రావడంతో వాటిని తప్పించబోయి అదుపు తప్పింది. ప్రమాద సమయంలో దుకాణంలో ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. అయితే దుకాణం ముందు భాగంలో ఉన్న రేకులు, షెడ్డు ఇనుప పైపులు, కరెంట్ తీగలు విరిగిపోవడంతో కొంతమేర నష్టం సంభవించింది. స్థానికులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని ట్రాక్టర్‌ను పక్కకు తొలగించారు. సమాచారం అందుకున్న అధికారులు ఘటనపై విచారణ చేపట్టారు. అధిక లోడ్‌తోపాటు నియంత్రణ లోపమే ప్రమాదానికి కారణమై ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**ప్రజాశక్తి - చంద్రగిరి:** గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిలో గల నారాయణ కళాశాల సమీపంలో శుక్రవారం రాత్రి ఈ ప్రమాదం జరిగింది. మృతుడు సుమారు 40 సంవత్సరాల వయసు కలిగి, తెల్లని బ్లూ లైన్లు గ్రిరలు కలిగిన టీషర్టు, సిమెంట్ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. మృతుని వద్ద ఆధారాలు ఏవి దొరకలేదన్నారు. ఎస్సై ప్రవల్లిక మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కోరారు.

## విశ్వం హై స్కూల్ విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి - క్యాంపస్ :** ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూష్యన్ కంపెనీ లిమిటెడ్ సీఎండీ శివశంకర్ ఆధ్వర్యంలో తిరుపతిలో రెండు రోజుల పాటు నిర్వహించిన శక్తి పొదుపు ప్రదర్శనలో జీవకోనలోని విశ్వం హై స్కూల్ విద్యార్థులు చురుకుగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో విశ్వం హై స్కూల్ విద్యార్థులు రూపొందించిన డ్రోన్ సాంకేతికత, విద్యుత్ శక్తి పొదుపుకు సంబంధించిన నమూనాలు, ఆధునిక శాస్త్రీయ ఆవిష్కరణలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రదర్శనను సందర్శించిన తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు, ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూష్యన్ కంపెనీ లిమిటెడ్ సీఎండీ శివ శంకర్ విశ్వం హై స్కూల్ విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అప్పుస్మా రాయలసీమ జోన్ అధ్యక్షులు, విశ్వం స్కూల్స్ చైర్మన్ డాక్టర్ ఎన్. విశ్వనాథ రెడ్డి పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు.

## విద్యతో పాటు విలువలు ముఖ్యం



**ప్రజాశక్తి - తిరుపతి సిటీ:**విద్యార్థులకు విద్యుత్ తో పాటు విలువలు కూడా ముఖ్యమని స్లేట్ స్కూల్ చైర్మన్ వాసిరెడ్డి అమర్నాథ్ రెడ్డి తెలిపారు. స్థానిక మహతి కళాక్షేత్రంలో చందమామ ఎదగాలి ప్రతి స్లేట్ కుటుంబం శుక్ల పక్ష చంద్రుడిలా అనే ప్రధానాంశంతో, స్లేట్ స్కూల్ పదవ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ,సెల్‌ఫోన్ల అతిగా వినియోగం వల్ల విద్యార్థుల ఏకాగ్రత దెబ్బతింటోందని, చదువుపై ప్రతికూల ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను అనవసరమైన డిజిటల్ వ్యసనాల నుంచి దూరంగా ఉంచి, విద్యాభివృద్ధికి తోడ్పడే సాంకేతిక సాధనాలను మాత్రమే ఉపయోగించేలా మార్గనిర్దేశం చేయాలని సూచించారు. ఆధునిక సాంకేతికతను విద్యకు అనుకూలంగా మలుచుకుంటేనే భవిష్యత్‌లో మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. అత్యధిక సాంకేతిక పరిజ్ఞానం కంటే, మానవీయ విలువలు చాలా అవసరం అన్నారు. స్లేట్ స్కూల్ విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలను అలవర్చుకోవాలని ఆయన ఆకాంక్షించారు. పదేళ్ల ప్రయాణంలో స్లేట్ స్కూల్ అనేక విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లిందని, విద్యార్థుల సమగ్ర అభివృద్ధే తమ లక్ష్యమని పేర్కొన్నారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన సాంస్కృత కార్యక్రమాల్లో స్లేట్ ది స్కూల్ అమలు చేస్తున్న, సంపూర్ణతా విధానంలోని 13 కీలక నైపుణ్యాలు ప్రతి ప్రదర్శనలో ప్రతిఫలించాయి. పిల్లల ప్రతిభను చూసి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ఉషా రాణి, ఫైజల్, వంశీకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పెట్రోల్ బంకుల్లో హెల్మెట్ స్టాల్ ప్రారంభించిన ఎస్పీ

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ:** తిరుపతి పోలీస్ పెట్రోల్ బంక్ వద్ద ఐఎస్ఐ మార్క్ హెల్మెట్ స్టాల్‌ను జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ స్టాల్‌లో కేవలం ఐఎస్ఐ మార్కు గల నాణ్యమైన హెల్మెట్లనే సరసమైన ధరకు, వాహనదారులకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. వాహనదారుల ప్రాణ రక్షణే ప్రధాన లక్ష్యంగా, రోడ్డు ప్రమాదాల వల్ల జరుగుతున్న ప్రాణనష్టాలను నివారించాలనే ఉద్దేశంతో ఈ ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. గత రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో హెల్మెట్ ధరించకపోవడం వల్ల ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయిన ఘటనను గుర్తు చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్, రాష్ డ్రైవింగ్ వంటి ప్రమాదకర చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే జైలు శిక్షలు కూడా విధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవి మనోహర్ ఆచారి, రామక్రిష్ణచారి, డిఎస్పి భక్తవత్సలం, చంద్ర శేఖర్, సీఐలు, ఎస్ఐలు, పోలీస్, సిబ్బంది పాల్గొన్నారు.

## గోపాల్ రెడ్డికి నివాళి

**ప్రజాశక్తి -కోట :** డాక్టర్ ఐ గోపాల్ రెడ్డి జయంతి సందర్భంగా ఎన్ బి కే ఆర్ ఐ ఎస్టీ లో సిబ్బంది ఆయన విగ్రహం వద్ద ఘనంగా శ్రద్ధాంజలి అర్పించారు. ఎన్ బి కే ఆర్ ఐ ఎస్టీ సిబ్బంది, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎమ్.శ్రీనివాసులు,సివిల్ విభాగాధిపతి డాక్టర్ పి.వి. సుబ్బారెడ్డి,మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ శ్రీహరి రెడ్డి, వ్యాయామ విద్యా విభాగాధిపతి డాక్టర్ వి.మల్లికార్జున రెడ్డి, లైబ్రేరియన్,పి.రామిరెడ్డి,ఎఓ శ్రీ. వేణుగోపాల్,అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది 20 డిసెంబర్ 2025న డాక్టర్ ఇస్కా గోపాల్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఆయన విగ్రహం వద్ద పూలమాలలు వేసి నావాళి అర్పించారు.

## పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి

**ప్రజాశక్తి - వాకాడు:**శనివారం వాకాడు ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన గ్రామాల అభివృద్ధికి ఎలా కృషి చేయాలి అనే ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో శ్రీనివాసులు మాట్లాడుతూ సుమిత్ర సర్వే పూర్తి చేసి అర్హులైన వారికి ఆస్తి హక్కు పత్రాలను అందజేయాలని అన్నారు.ప్రతి పంచాయతీలో ఇంటి పన్ను, కొళాయి పన్ను,ఇతర ఆస్తి పన్నులను సకాలంలో వసూలు చేసి గ్రామాభివృద్ధికి వినియోగించాలని సూచించారు. అలాగే పంచాయతీల్లో పారిశుద్ధ్యన్ని మెరుగుపరిచి,స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో దేవ దానం, ప్రతిభారాణి, సచివాలయం సిబ్బంది, పంచాయితీ సెక్రటరీలు పాల్గొన్నారు.

## బస్టాండ్‌లో మౌలిక వసతులు కల్పించాలి

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ:** తిరుపతి ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు దిగాలంటే ముక్కు మూసు కోవాల్సిందేనని, ఇంటి పేరు కస్తూరి కానీ ఇంట్లో గబ్బిలాల కంపు అంటూ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పి దుర్గాభవాని ఏద్దేవా చేశారు. శనివారం తిరుపతి ఆర్టీసీ బస్టాండ్‌లో పారిశుధ్య లోపంతో అస్తవ్యస్తంగా ఉన్న బస్టాండ్ పరిసరాలను బాగు చేయాలని సిపిఐ నగర కార్యదర్శి జె విశ్వనాథ్ నాయకత్వంలో ఆర్టీసీ బస్టాండ్ లో ధర్నా చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ , విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా వర్సిటీలో జాతీయ సదస్సు

**ప్రజాశక్తి - క్యాంపస్ :**శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం గణాంక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో పిఎమ్ ఉషా సౌజన్యంతో ఇన్‌స్పైరింగ్ మైండ్స్: మహిళా గణాంక శాస్త్రవేత్తల నేతృత్వంలో జాతీయ సదస్సు శనివారం నిర్వహించారు. దక్షిణాఫ్రికాలోని యూనివర్సిటీ ఆఫ్ జూలుల్యాండ్ నుంచి ప్రొఫెసర్ శ్యామల కృష్ణనాయర్, డాక్టర్ అనిల్ కుమార్ విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచార్య శ్యామల కృష్ణనాయర్ పరిశ్రమలలో మల్టీస్కేల్ ప్రాసెస్ మానిటరింగ్ మరియు సింగులర్ స్పెక్ట్రమ్ డీకంపోజిషన్ వంటి అధునాతన పద్ధతులపై అవగాహన కల్పించారు. డాక్టర్ అనురాధ డేటా సైన్స్ రంగంలో గణాంక శాస్త్ర పాత్రను వివరిస్తూ పైథాన్, ఆర్, పవర్ బిఐ వంటి సాధనాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో డీన్లు ఆచార్య సుధ, పిఎమ్ ఉషా కోఆర్డినేటర్ ఆచార్య వాణి, గణాంక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ శివపార్వతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్రీయ గ్రామీణ స్వరాజ్ అభియాన్

**ప్రజాశక్తి - వాకాడు:** వాకాడు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని స్త్రీ శక్తి భవనంలో మండల రిసోర్స్ పర్సన్స్‌కి, గ్రామ పంచాయతీ సొంత ఆదాయ వనరులు పెంపునకు సాంకేతిక వ్యూహాలు అనే అంశంపై శనివారం శిక్షణ నిర్వహిం చారు. ఈ కార్యక్రమాన్ని పరిపాలన అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించగా, గ్రామపంచాయతీల ఆర్థిక స్వావలం బన సాధనలో సాంకేతిక పద్ధతుల ప్రాధాన్యతపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ శిక్షణలో రిసోర్స్ పర్సన్స్ పాల్గొని, గ్రామపంచాయతీల సొంత ఆదాయ వనరులను పెంపొందిం చడానికి అవసరమైన ఆధునిక విధానాలు, ప్రణాళికలు, అమలు వ్యూహాలపై విపులంగా శిక్షణ అందిస్తున్నారు.ఈ కార్యక్రమం ద్వారా మహిళల నైపుణ్యాలు మెరుగుపడి, గ్రామాల సమగ్ర అభివృద్ధికి తోడ్పడతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో భూసార పరీక్షలు

**ప్రజాశక్తి - చంద్రగిరి:** తిరుపతి డివిజన్, చంద్రగిరి మండలంలో జిల్లా వనరుల కేంద్రం తిరుపతి వారి ఆధ్వర్యంలో శనివారం భూసార పరీక్ష ఫలితాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ భూసార పరీక్ష మరియు భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల వాడకం ద్వారా రైతులకు సాగు ఖర్చు తగ్గడమే కాక ఆహార భద్రతను ఆరోగ్య భద్రతను కలిగిస్తాయని తెలియజేశారు. చంద్రగిరి మండల వ్యవసాయ అధికారి శ్రీ విజయ భాస్కర్ మాట్లాడుతూ రైతులకు తప్పక భూసార పరీక్ష ఫలితాలు ఆధారంగానే పంటలకు ఎరువులను వాడుకోవాలని అది పర్యావరణానికి మేలు చేయడమే కాక నేల ఆరోగ్యమును కూడా కాపాడుతుందనీ తెలియజేశారు.

## గిరిపుత్రులకు శిక్షణ

**ప్రజాశక్తి - ఓజిలి:** కామెల్ సంస్థ ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా, ఓజిలి మండలం స్త్రీ శక్తి భవనంలో 10 గ్రామాల నాయకులతో సాంఘిక సంక్షేమ పథకాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రభుత్వ అధికారులతో ముఖా ముఖి చర్చ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపిఓ లు పివి రమణయ్య, నిరంజన్ ఓజిలి ఎంపీడీవో నారాయణ రెడ్డి, ఏపీఓ చిన్నయ్యలు పాల్గొన్నారు. మండలంలో అధిక గిరిజన ప్రజలు ఉన్న గ్రామాలలో మౌలిక సదుపాయాలు కోసం చర్యలు తీసుకుంటామని, ప్రతి గిరిజన గ్రామంలో త్రాగునీటి సమస్య లేకుండా, యానాదుల హక్కులకు భంగం కలగకుండా చర్యలు చేపడతామని తెలిపారు. గిరిపుత్రులతో మాట్లాడుతూ యానాదులకు మత్స్యకారుల సొసైటీ మత్స్యకారుల సంఘాల ఏర్పాటు, భూమి అభివృద్ధి, నైపుణ్యత శిక్షణ తరగతుల గురించి వివరించారు. చివరిగా కెమెల్ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ గరిక ఈశ్వరయ్య మాట్లాడుతూ గిరిజనుల యొక్క అభివృద్ధి ధ్యేయంగా గత 35 సంవత్సరాలుగా క్యామెల్ సంస్థ అందులో ప్రధానంగా ఓజిలి, నాయుడుపేట ,పెళ్లకూరు, చిట్టమూరు,దొరవారిసత్రం మండలాలలో గిరిజన గ్రామాల లో పని చేస్తుందని, వారి అభివృద్ధికి తోడ్పాటుపడేందుకు క్యామెల్ సంస్థ ఎప్పుడు ముందుంటుందని తెలిపారు.

## విఐపి దర్శనాలు టీడీపీ, బీజేపీ దర్శనాలుగా మారాయి : చింతా

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ:**తిరుమలలో విఐపి బ్రేక్ దర్శనం టిడిపి బిజెపి దర్శనాలగా మారాయని మాజీ కేంద్రమంత్రి డాక్టర్ చింతామోహన్ విమర్శించారు. టీటీడీఏడీ బిల్డింగ్ వద్ద సోమవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి వాసులకు ముక్కోటి ఏకాదశి రోజు ప్రవేశం లేదు. లాటరీ పెట్టి, బొంబాయి, ఢిల్లీ, పంజాబ్ వాళ్లకు ఇస్తున్నారు, ఇది అన్యాయం, మేము సహించం అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు వేల మందికి ప్రత్యేక ప్రవేశ దర్శనం ఉచితంగా ఇచ్చాము. మా ఊరిలో, మా టెంపుల్ లో, మీ పెత్తనం ఏంది? టిటిడి ఏ ఒక్కరి సొత్తు కాదు. అందరి సొత్తు అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యార్లపల్లి గోపి గౌడ్, రవి, తేజోవతి, శాంతి యాదవ్, రావణ్, వెంకటేష్ గౌడ్, కుమార్, బాలకృష్ణ, మణి, వీరమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రచందనం స్వాధీనం - ముగ్గురి అరెస్ట్

**ప్రజాశక్తి - రేణిగుంట:** రేణిగుంట – రైల్వే కోడూరు రహదారిలో వాహన తనిఖీలు చేస్తుండగా కారులో రవాణా చేస్తున్న 12ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ముగ్గురు స్మగ్లర్లను టాస్క్ ఫోర్సు పోలీసులు అరెస్టు చేసినట్లు టాస్క్ ఫోర్స్ పోలీసుల తెలిపారు. వీరి నుంచి కారు, పైలట్‌గా ఉపయోగిస్తున్న బైక్‌ను సీజ్ చేశామన్నారు. టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ అధ్వర్యంలో ఎఎస్పీ కులశేఖర్ పర్యవేక్షణలో డీఎస్పీ ఎండీ షరీఫ్ మార్గ నిర్దేశకత్వంలో ఆర్ఐ సాయి గిరిధర్‌కు చెందిన ఆర్ ఎస్ఐ లింగాధర్ టీమ్ ఎఫ్బీఓ పి. చెంగలరాయుడుతో కలసి శనివారం తెల్లవారు జాము నుంచి రైల్వే కోడూరు రోడ్డులో ఉన్న ఆంజనేయపురం ఫారెస్ట్ చెక్ పోస్టు వద్దకు చేరుకుని వాహన తనిఖీలు చేపట్టారు. సుమారు 5గంటల ప్రాంతంలో ఒక బైక్‌లో ఒక వ్యక్తి వచ్చి, పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. అతన్ని పట్టుకోగా, వెనకే వస్తున్న కారు తప్పించుకునేందుకు ప్రయత్నించింది. దీంతో కారును చుట్టుముట్టే ప్రయత్నం చేయగా, డ్రైవరు కారును తప్పించబోయి అక్కడే ఆగి ఉన్న లారీని ఢీ కొన్నాడు. దీంతో కారు ముందు భాగం ధ్వంసమయ్యింది. కారులోని కొందరు వ్యక్తులు దిగి పారిపోసాగారు. అయితే టాస్క్ ఫోర్సు పోలీసులు వారిని వెంబడించి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. కారులో చూడగా అందులో 12ఎర్రచందనం దుంగలు లభించాయి. వాహనాలు, ముగ్గరు స్మగ్లర్లతో సహా ఎర్రచందనం దుంగలను తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్ కు తరలించారు. పట్టుబడిన వారిలో ఒకరు రేణిగుంటకు చెందిన వ్యక్తి కాగా, మరో ఇద్దరు తమిళనాడు సేలం జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు.

## ఎస్‌బిఐ రుణాలను సద్వినియోగం చేసుకోండి

**ప్రజాశక్తి - సత్యవేడు:** వ్యవసాయ తయారీ కేంద్రాల ఏర్పాటుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందించే రుణ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్టేట్ బ్యాంక్ డిప్యూటీ రీజనల్ మేనేజర్ (వ్యవసాయం) సుమన్ రైతులకు సూచించారు. శనివారం స్థానిక బేరి శెట్టి కళ్యాణ మండపంలో జాతీయ రైతు దినోత్సవాన్ని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సత్యవేడు శాఖ మేనేజర్ సూర్య ప్రకాష్, మండల వ్యవసాయ అధికారి మురళి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్టేట్ బ్యాంక్ డిప్యూటీ రీజనల్ మేనేజర్ (వ్యవసాయం) సుమన్ హాజరయ్యారు. మేనేజర్ సుమన్ రైతులతో మాట్లాడుతూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అన్నదాతలైనా రైతులకు చేయూతనివ్వడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుంది అన్నారు. రైతులకోసం కొత్త పథకాలను బ్యాంకు ప్రవేశపెట్టిందన్నారు. అలాగే పంట రుణాలు, పంట బీమా, వ్యక్తిగత భీమా, ట్రాక్టర్ రుణాలు, వ్యవసాయ సాంకేతిక పరికరాల రుణాలు వంటి పలు అంశాలపై ఆయన రైతులకు వివరించారు. రైతులు వ్యవసాయ తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసుకోవడానికి రుణ సహాయం అందిస్తుంది అన్నారు. నేటి నాగరిక యుగంలో వ్యవసాయాన్ని ఆదరించవలసిన బాధ్యత ప్రతి ఒక్క పౌరునికి ఉంది అన్నారు. అనంతరం రైతులకు జాతీయ రైతు దిన శుభాకాంక్షలు తెలిపి పలు రైతులను సన్మానించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మురళి పాల్గొని వ్యవసాయ రుణ సంబంధమైన పలు అంశాలపై రైతులకు వివరణ ఇచ్చారు.

## శిక్షణా కార్యక్రమాలతో అవగాహన

**ప్రజాశక్తి-క్యాంపస్:**శిక్షణా కార్యక్రమాలతో విద్యార్థులకు ప్రయోగాత్మకమైన అవగాహన కలుగుతుందని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం విసి ఆచార్య నరసింగరావు పేర్కొన్నారు. ఎస్వీయూ ఫిజిక్స్ విభాగంలో గత వారం రోజులుగా నిర్వహించిన శిక్షణా కార్యక్రమం ముగిసింది. ఇందుకు సంబంధించిన సమాపనోత్సవంలో వీసి ప్రొఫెసర్ నరసింగరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఫిజిక్స్ విభాగం బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో మంచి ప్రగతిని సాధిస్తుందని కితాబిచ్చారు. విద్యార్థుల్లో ప్రయోగాత్మకమైన అవగాహన కల్పించడానికి ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కార్యక్రమం కో–ఆర్డినేటర్లు ప్రొఫెసర్ దేవ ప్రసాదరాజు, ప్రొఫెసర్ హేమ, సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఓ.వి.ఎస్. రెడ్డి, భౌతిక శాస్త్ర ప్రొఫెసర్ హుస్సేన్, అధ్యాపకులు, పరిశోధకులు, ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గూడూరును జిల్లా చేయాలి

**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** గూడూరుని జిల్లాగా ప్రకటించాలని జరుపుతున్న ఉద్యమంలో సోమవారం ఉదయం 9.30 గంటల కు గూడూరులోని టవర్ క్లాక్ సెంటర్ సమీపంలో గూడూరు జిల్లా సాధన కమిటీ వారి ఆధ్వర్యంలో శ్రీ విజయ దుర్గ అమ్మవారి ఉపపీఠం తరపున ప్రత్యేక హోమాలు నిర్వహించబడతాయని ఉప పీఠం నిర్వాహకులు కోట సునీల్ స్వామి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు అభివృద్ధికి భగవంతుని వేడుకుంటూ ఈ యాగం నిర్వహించబడుతుందన్నారు.

## క్రీడలతో ఆరోగ్యం

**ప్రజాశక్తి-తిరుపతి టౌన్:**మనిషి ఆరోగ్యకర జీవనం గడపాలంటే క్రీడలు ఎంతో ముఖ్యమని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సెక్రటరిల ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు తారకరామ స్టేడియంలో తిరుపతి సచివాలయం ఎంప్లాయిస్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ (టి.ఎస్.ఈ.సి.పి.ఎల్)ను నిర్వహించారు. శనివారం సాయంత్రం నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని విజేతలకు కప్పును అందజేశారు. ఈ కార్యక్రమంలో తుడా పి. ఓ. దేవికుమారి, నగరపాలక సంస్థ రెవిన్యూ ఆఫీసర్ సేతుమాదవ్, డి.ఈ. లు మహేష్, రాజు, రమణ, ప్రసాద్, లలిత, నగరపాలక సంస్థ, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

## వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** గూడూరు, డిఆర్ డబ్ల్యు కళాశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఆలఘునాథ స్వామి దేవాలయం వద్ద వృద్ధులకు దుప్పట్లు, ఆహార పొట్లాలను అందచేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సేవా దృక్పథాన్ని అలవరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కలశాల ప్రిన్సిపాల్ హనంత రావు, వైస్ ప్రిన్సిపాల్ గాయత్రి, లెక్చరర్ నాగలక్ష్మి, సంధ్యారాణి , తదితరులు పాల్గొన్నారు.

## నేడు పల్స్ పోలియో

**ప్రజాశక్తి - చంద్రగిరి:** నేడు చంద్రగిరి మండల వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ కుసుమ ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాలలో పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు.

## సొంత ఆదాయ వనరులపై శిక్షణ

**ప్రజాశక్తి -కోట :** కోట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ సొంత ఆదాయ వనరుల పెంపునకు సాంకేతిక వ్యూహలపై శనివారం మండల స్థాయిలో ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్సులు, విఆర్ఓలు, డిజిటల్ అసిస్టెంట్ లు, సర్వేయర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఎంపీడీవో దిలీప్ కుమార్ నాయక్,డిప్యూటీ ఎంపీడీవో వేణు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో అవగాహన

**ప్రజాశక్తి - క్యాంపస్ :**శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ బ్యూరో, ఎన్ఎస్ఎస్ యూనిట్ 21, 9 ఆధ్వర్యంలో వేమూరు గ్రామం, సి.గొల్లపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక శిబిరంలో పలు అవగాహన కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ పర్యావరణ రంగంలో స్వయం ఉపాధి మరియు వ్యాపార అవకాశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డా. కె. గంగాధరం, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డా. వి. జ్యోత్స్న, కల్పన, ప్రొఫెసర్ ఐ.వి.లలిత కుమారి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, మరియు డా. కె.ఆర్. పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

## పరీక్షా సామగ్రి వితరణ

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్(తొట్టంబేడు):** మండలంలోని బోనుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి, రైటింగ్ ప్యాడ్స్ వితరణగా అందజేశారు. శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన విశ్రాంత ట్రాన్స్ కో ఉద్యోగి రమణరావు మనుమరాలు ఆద్య ఆధ్వర్యంలో శనివారం ఈ సామగ్రి పంపిణీ చేపట్టారు. విద్యార్థులు పరీక్షలు సమర్థవంతంగా రాసి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తేవాలని దాతలు కోరారు. ఈ కార్యక్రమంలో రాజేష్, మోహన్ కుమార్, హేమంత్ కుమార్, ప్రధానోపాధ్యాయురాలు భారతి, ఉపాధ్యాయులు మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిరాశ్రయులైన కుటుంబానికి చేయూత

**ప్రజాశక్తి - బాలాయపల్లి :** మండలంలోని ఊట్లపల్లి గ్రామంలోని గిరిజన కాలనీలో ఇటీవల ఏకోలు పెంచలమ్మ అనే మహిళ కు చెందిన ఇల్లు షాట్ సర్క్యూట్ తో దగ్ధమై పోయి నిరాశ్రయులైంది. నిరాశ్రయులైన కుటుంబానికి నవజీవన్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు సహదేవయ్య సహకారంతో నవజీవన్ సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ టి శ్రీనివాసులు 5000 రూపాయల విలువగల నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చీకోలు మారయ్య, శనగా మారయ్య తదిరతులు పాల్గొన్నారు.

## మిన్నంటిన జగన్ జన్మదిన వేడుకలు

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా భారీ ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించారు. 600 మంది యువకులకు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. 400 మంది డప్పు కళాకారులకు డప్పులను అందజేశారు. జగన్ మీద అభిమానంతో 23 ఏళ్ల కిందటే జగన్ చారిటబుల్ ట్రస్ట్ పేరుతో తాను ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు మధుసూదన్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. జననేతకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఘనంగా తెలపడం ఆనందంగా ఉందని మధుసూదన్ రెడ్డి అన్నారు. అంజూరు తారక శ్రీనివాసులు, ఓడూరు గిరిధర్ రెడ్డి, వయ్యాల కృష్ణారెడ్డి, ఉన్నం వాసుదేవ నాయుడు, వడ్ల తాంగల్ బాలాజీ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.